చికిత్స వివరాలు తెలిపే యాప్

- ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా మెరుగైన సేవలు
- వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల వివరాలూ చూసుకోవచ్చు
- చికిత్సకు ముందుగానే ఆసుపత్రికి రిక్వెస్ట్ పంపే సదుపాయం
- కార్డుదారులు సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించుకోవాలంటున్న అధికారులు

వైద్యసేవల్లోనూ ఆధునిక సాంకేతిక వినియోగం పెరిగిపోయింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం నూతన ఆవిష్కరణలు చేస్తుంది. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ యాప్‌ను తీసుకొచ్చింది. ఇందులో కార్డుదారుడి వివరాలతో పాటు గతంలో చేయించుకున్న చికిత్స, అందుకు సంబంధించిన వైద్య పరీక్షలు, ప్రభుత్వం ఎంత చెల్లించింది, కుటుంబ సభ్యుల వివరాలూ అందుబాటులో ఉంచింది. అలాగే.. ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఏఏ ఆసుపత్రుల్లో ఏ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.. ముందుగానే రిక్వెస్ట్ పంపి చికిత్స చేయించుకునే వెసులుబాటు కల్పించింది.


ఆదోనిలోని విజయభాస్కర్‌రెడ్డి కాలనీలో మొబైల్ ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేస్తున్న ఏఎన్‌ఎంలు, వలంటీర్లు

ఆదోని సెంట్రల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కార్డుదారులకు అవసరమైన చికిత్సలు ఏఏ అస్పత్రుల్లో ఉన్నాయో వాటి వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అండ్రాయిడ్ మొబైల్ కలిగిన ప్రతి కార్డుదారుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇంటింటా సర్వే చేస్తున్న వలంటీర్ల ద్వారా మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో తమకు కేటాయించిన క్లస్టర్ల పరిధిలోని లబ్ధిదారుల ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ప్రయోజనాలను వివరిస్తున్నారు.

యాప్‌తో ఉపయోగాలు..

ఆరోగ్యశ్రీ కార్డు నంబర్ లేదా కుటుంబ సభ్యుడి అధార్ నంబర్‌ను యాప్‌లో ఎంటర్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన ఆరోగ్యశ్రీ వివరాలు తెలుస్తాయి. తాము గతంలో చేయించుకున్న చికిత్సలు, వైద్య పరీక్షల వివరాలను లబ్ధిదారులు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. భవిష్యత్‌లో మెడికల్ రిపోర్టు అవసరమైతే ఈ యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ అస్పత్రులకు సంబంధించిన సమాచారం కూడా ఇందులో అందుబాటులో ఉంటుంది. ఈ పథకం ద్వారా పొందిన చికిత్స వివరాలను కూడా తెలుసుకోవచ్చు. చికిత్స సమయంలో జరిగిన వైద్య పరీక్షలు కూడా ఇందులో అప్‌లోడ్ చేసి ఉంచుతారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందించిన సంబంధిత అస్పత్రికి ఎంత మొత్తంలో డబ్బు చెల్లించారనే వివరాలను కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రతి కార్డు దారుడు డౌన్‌లోడ్ చేయించుకోవాలి



అండ్రాయిడ్ ఫోన్ కలిగిన ప్రతి ఆరోగ్యశ్రీ కార్డుదారుడు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించుకోవాలి. ఆరోగ్యశ్రీకి నెట్‌వర్క్ హాస్పిటళ్ల వివరాలతో పాటు ఏఏ అస్పత్రుల్లో ఏ చికిత్సలు అందిస్తారో వాటి వివరాలను అందుబాటులో ఉంచారు. చికిత్సను బట్టి సంబంధిత అస్పత్రికి మొబైల్ ఫోన్లలోనే రిక్వెస్ట్ పెట్టవచ్చు. రిక్వెస్ట్ పెట్టడానికి మీకు రాకపోతే.. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎం లేదా వలంటీర్ల ద్వారా రిక్వెస్ట్ పెట్టి అనుమతులు తీసుకొని చికిత్సకు వెళ్లవచ్చు. కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ మీ వలంటీర్ ద్వారా కానీ, క్లస్టర్ ఏఎన్‌ఎం ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేయించుకోవాలి.

– డాక్టర్ సత్యవతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, ఆదోని

క్లుప్తంగా

నిర్మాణాలకు ఎమ్మెల్యే విరాళం


పీర్ల చావిడి నిర్మాణానికి నగదును అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలో పీర్ల చావిడి, తాయమ్మవ్వ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే తరపున వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి పీర్లచావిడి నిర్వాహకులకు రూ.50వేలు, తాయమ్మ ఆలయ కమిటీ సభ్యులకు రూ.50వేలు అందజేశారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, కోఆప్షన్ మెంబర్ షౌకత్ అలీ పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ


కిట్లను అందజేస్తున్న డాక్టర్ సత్యవతి

ఆదోనిటౌన్: స్థానిక శంకర్‌నగర్‌లోని మాక్ సెంటర్‌లో శుక్రవారం పదిమంది క్షయ వ్యాధిగ్రస్తులకు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, సూపర్‌వైజర్ బాబురాజు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. పవర్‌గ్రిడ్ సంస్థ సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషణ నిమిత్తం కిట్లు అందజేశారు. ప్రధానమంత్రి ముక్త్, టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశామని డాక్టర్‌లు సత్యవతి, హర్షిక, షేకున్‌బాను తెలిపారు. ఒక్కొక్కరికి ఆరు నెలలకు సరిపడ సరుకులు అందజేశారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యమొద్దు

ఆదోనిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించొద్దని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సచివాలయ అధికారులకు సూచించారు. సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని, సమస్యలకు పరిష్కారం చూపి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. శుక్రవారం పట్టణంలోని 01, 8వ వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, గైర్హాజరైన వారి వివరాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు.

కోర్టులో సిబ్బందిని నియమించాలి


జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావుతో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సభ్యులు

ఆదోనిరూరల్: ఆదోనిలోని అదనపు జిల్లా కోర్టులో సిబ్బంది నియామకాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదోని బార్‌అసోసియేషన్ ప్రెసిడెంట్ అనితాబాయి, సభ్యులు సవితారాణి, లావణ్య కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. అనితాబాయి మాట్లాడుతూ సబ్‌కోర్టులో కొద్ది నెలల నుంచి న్యాయమూర్తి లేరని, ఆ స్థానంలో మరో న్యాయమూర్తి వారానికి రెండుసార్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వలస వెళుతూ మృత్యువాత


మద్దిలేటి (ఫైల్)

దేవనకొండ: వలస వెళ్తూ మార్గమధ్యలో గుండెపోటు రావడంతో బంటుపల్లి గ్రామానికి చెందిన మద్దిలేటి (45) మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రంలో పనులు చేసేందుకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్తుండగా మార్గమధ్యలో ఉన్నఫలంగా ఛాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మద్దిలేటి మృతిచెందాడు. ఇంటి నిర్మాణం కోసం దాదాపు రూ.20 లక్షలు అప్పులు చేశారని, కుటుంబ పోషణ కోసం వలస వెళ్లే క్రమంలో ఘటన చోటు చేసుకుంది. మృతుడికి భార్య హనుమంతమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంత్రాలయం: మండలంలోని మాధవరం గ్రామ శివారులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి చెందాడు. మాధవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం ముద్దెబిహాల్, బీజాపూర్‌కు చెందిన విశ్వనాథ్‌గౌడ్ అలియాస్ విశ్వ(37) శ్రీ మఠం ముందు రాఘవేంద్ర చిత్రపటాలు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. శుక్రవారం రాత్రి గిల్కెసూగూరు క్యాంపు నుంచి బైక్‌పై మంత్రాలయం వస్తుండగా మాధవరం గ్రామ శివారులో కర్ణాటక ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో విశ్వనాథ్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..


బుక్‌లెట్ అందజేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సూగూరు గ్రామంలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధి పొందిన పథకాలను వివరించే బుక్‌లెట్ అందజేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జి.భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు పాల్గొన్నారు.

ధర్మరక్షణే ధ్యేయంగా టీటీడీ కార్యక్రమాలు


గోపూజలో పాల్గొన్న వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం: ధర్మరక్షణే ధ్యేయంగా టీటీడీ కార్యక్రమాలు చేపడుతుందని టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద నిర్వహించిన గోపూజ, గోమాతతో నగర సంకీర్తన శోభాయాత్ర, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి గోపూజలో పాల్గొన్నారు. అనంతరం హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వహకులు డాక్టర్ మల్లువెంకటరెడ్డి, సభ్యులు సూర్యనారయణ, భీమిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు భీమయ్య ఆచారి నేతృత్వంలో ఆయనను సన్మానించారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, వ్యవసాయ సలహామండలి సభ్యుడు మల్లికార్జున, ఎంపీటీసీ వెంకటేష్‌శెట్టి, అర్చకులు శ్రీరంగం శేషాచార్యులు, మధుసూదన్ ఆచార్యులు, భాస్కర్, ప్రవీణ్ ఉన్నారు.

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి


కోసిగి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

కోసిగి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. శుక్రవారం కోసిగి పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ సామాజిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో 70 వరకు పెండింగ్‌లో కేసులు ఉన్నట్లు చెప్పారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సీఐ ఎరిసా వలి, ఎస్‌ఐ సతీష్‌కుమార్‌ను ఆదేశించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. శాంతి భద్రతలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అక్రమ మద్యం, అక్రమ రవాణా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కొనసాగిన గ్రంథాలయ వారోత్సవాలు


కోసిగిలో ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

ఆదోనిఅర్బన్: స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయాధికారిణి సుజాత ఆధ్వర్యంలో కొనసాగాయి. గ్రంథాలయంలో కవి సమ్మేళనంపై రిటైర్డ్ హెచ్‌ఎం దేవప్రసాద్ మాట్లాడారు. కవిత ద్వారా నీతి పద్యాలు, భావాలు వివరించారు. విద్యార్థినులకు పాటలు, పద్యాలు వాటి భావాల పోటీలు నిర్వహించారు. అనంతరం నెహ్రూ మెమోరియల్ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

కోసిగి: గ్రంథాలయ అధికారి దుల్లయ్య ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థినులకు కబడ్డీ, ఖోఖో ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు.

కౌతాళం: కవులు, రచయితలు తమ సందేశాలతో సమజాభివృద్ధికి పాటుపడాలని గంథ్రాలయ అధికారిణి మధులినా అన్నారు. గంథ్రాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గంథ్రాలయంలో కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలు కార్యక్రమాలను నిర్వహించారు.

సహకార రంగం బలోపేతానికి చర్యలు


టౌన్‌బ్యాంక్ ఆవరణలో పతాక ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా సహకార శాఖ అధికారి

ఎమ్మిగనూరుటౌన్: సహకార రంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక టౌన్‌బ్యాంక్ ఆవరణలో సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సహకార రంగాల్లో ఒకటైన టౌన్ బ్యాంక్ అభివృద్ధి బాటలో పయనించేలా పాలకవర్గం, సిబ్బంది సమిష్టి కృషితో పనిచేయాలని సూచించారు. రుణాల రికవరీ సక్రమంగా ఉంటే బ్యాంకు అభివృద్ధి చెందుతుందని సూచించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. డివిజనల్ సహకార శాఖ అధికారిణి రమాదేవి, బ్యాంకు సీఈఓ గంగాధర్, డైరెక్టర్లు సయ్యద్‌చాంద్, తట్టెబుడ్డప్ప, పల్లవిరాజశేఖర్, వడ్డెరంగన్న, రజాక్,శ్రీరామ్, మహనందయ్యశెట్టి, డివిజన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వంటమనిషికి స్వల్పగాయాలు

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణం చక్కరాళ్ల రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో శుక్రవారం వంటమనిషి ఈరమ్మకు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో స్వల్పగాయాలు అయ్యాయి. వంటచేసేందుకు ఎలక్ట్రిక్ కుక్కర్ వినియోగించే సమయంలో విద్యుత్‌షాక్ తగలడంతో ఆస్వస్థతకు గురైన ఈరమ్మను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకున్నారని, విద్యుత్ స్విచ్ బోర్డులలో మరమ్మతుల కోసం ఎలక్ట్రీషియన్‌కు సమాచారం ఇచ్చామని ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు.

వ్యాసరచన పోటీలు

మంత్రాలయం: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని లైబ్రేరియన్ వసంతలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తామని ఆమె తెలిపారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నియామకం

ఆదోనిఅర్బన్: బీజేపీ ఆదోని అసెంబ్లీ కన్వీనర్‌గా జి.శ్రీరాములు, కో–కన్వీనర్‌గా మాదాసి కురువ నాగరాజుగౌడ్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి శుక్రవారం ఉదయం ఆదేశాలు జారీ చేశారు. నాగరాజుగౌడ్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పారు.

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తికి గాయాలు

కోసిగి: స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి . స్థానికులు తెలిపిన వివరాల మేరకు దుద్ది గ్రామానికి చెందిన జోజి అనే వ్యక్తి బైక్‌పై తహసీల్దార్ కార్యాలయం వైపు వెళ్తుండగా ఆదోని నుంచి ఓ వ్యక్తి కోసిగి వైపు పల్సర్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టి వేగంగా వెళ్లిపోయాడు. దీంతో జోజికి తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రాంట్ విడుదల చేయాలి

ఆదోని సెంట్రల్: పాఠశాల నిర్వహణ గ్రాంట్ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య పట్టణ అధ్యక్షుడు అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు బి.బసవరాజు కోరారు. శుక్రవారం ఉర్దూ పురపాలక పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం నిర్వహణ గ్రాంట్ కూడా ఇవ్వాలన్నారు. నాయకులు సురేష్ కుమార్, ప్రతాప్ రెడ్డి, మద్దయ్య పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

ఆస్పరి: ఆస్పరి కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న పల్లవి అనే విద్యార్థిని యోగా పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. కలకత్తాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆమెకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. విషయం తెలుసుకున్న తెర్నేకల్లు కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం పాఠశాలకు వెళ్లి క్రీడాకారిణి పల్లవికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. క్రీడాకారిణిని ప్రోత్సహించినందుకు ప్రిన్సిపాల్ శారోన్ స్మైలీ, పీఈటీ రాజేశ్వరి, ఉపాధ్యాయినులు ధన్యవాదాలు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: బాల్య వివాహాలు అరికట్టాలని, ఎవరైనా ప్రోత్సహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మస్తాన్‌వలి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో హ్యూమన్ రైట్స్ కమిటీ ఆధ్వర్యంలో విద్యా హక్కు చట్టం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే విద్యార్థినులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఉచిత నిర్బంధ విద్య చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల్లోపు పిల్లలు కచ్చితంగా విద్యనభ్యసించాలని సూచించారు. కమిటీ డివిజన్ అధ్యక్షుడు అజిత్‌కుమార్, హెచ్‌ఎం కోటప్ప తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆస్పరి: ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహులు తెలిపారు. పీజీలో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, ఆసక్తి గల వారు దరఖాస్తును కళాశాలలో ఇవ్వాలన్నారు. వివరాలకు సెల్ 9985197739 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: ఖాళీగానున్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయని హాల్వి, చిరుతపల్లి, కాత్రికి, కుంటనహాల్, గుడికంబాలి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఈనెల 21వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 23న మౌఖిక పరీక్ష ఉంటుందని, ఎంపికైన వారిని 25న ప్రకటిస్తామని, 28నుంచి రెండు రోజుల శిక్షణ అనంతరం ఈనెల 30వ తేదీ నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందని చెప్పారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

కౌతాళం: ఉత్తమ విద్యార్థిగా ఎదగడానికి క్రమశిక్షణతో అభ్యసించినప్పుడే విద్య అనే పునాదిపై ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోగలరని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు బానిసలై సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కరస్పాండెంట్ దూద్‌బాషా, హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ


గోదాములో నిల్వల వివరాలను అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: పట్టణంలోని పౌర సరఫరాల గోదామును ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ కార్డు లబ్ధిదారులకు సరుకుల పంపిణీలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అలాగే పట్టణంలోని అమరావతినగర్‌లోని ఎండీయూ వాహనాన్ని, ఆర్ ఆర్ లేబర్ కాలనీలోని ప్రభుత్వ చౌక ధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని వారిని ఆదేశించారు. పౌర సరఫరాల ఉప తహసీల్దార్ వలీబాషా, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూముల పరిశీలన

మండలంలో అభివృద్ధి పనులకు అవసరమైన భూములను సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ పరిశీలించారు. శుక్రవారం మండలంలోని చిన్నపెండేకల్‌లో ఆంధ్రప్రదేశ్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వారు చేపడుతున్న అభివృద్ధి పనులకు భూముల కేటాయింపు, ల్యాండ్ అలియనేషన్ కోసం ప్రభుత్వ భూములను పరిశీలించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. ఆదోని ఉప తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ జయరామ్‌రెడ్డి, వీఆర్వో తిరుమల్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



కుంటనహాల్‌లో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం,కుంబళనూరులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న దృశ్యం


కౌతాళంలో పథకాల బ్రోచర్ అందజేస్తూ..

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమైందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్ను సీఎంగా గెలిపించుకుందామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి, సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంతో పాటు కుంటనహాల్, కుంబళనూరు క్యాంపు, బాపురం, ఉప్పరహాల్ తదితర గ్రామాల్లో నిర్వహించారు.ఈ సందర్భంగా వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందాయ లేదా, పాలనలో టీడీపీ హయాంతో పోల్చి చెప్పారు. గతంలో టీడీపీ అందజేసిన పథకాలు, ప్రస్తుతం అందుతున్న పథకాలు, తీరును వివరించారు. మాజీ సర్పంచ్ అవతారం, కుంబళనూరు ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, కుంటనహాల్ ఇన్‌చార్జ్ శివరాం, నాయకులు సుబ్బారాజు, ఉలిగయ్య, ఉమపతి, అబ్దుల్‌సమద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం వెణిగండ్లలో గురువారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి 14 సంవత్సరాల్లోపు సాఫ్ట్‌బాల్ పోటీలకు స్థానిక ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని కీర్తన ఎంపికైంది. అదేవిధంగా 14సంవత్సరాల్లోపు విభాగంలో కర్నూలులో జరిగే రగ్బీ పోటీలకు ఎం.దక్షిత ఎంపికైనట్లు హెచ్‌ఎం కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. క్రీడాకారిణులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు సుజనకుమారి, నాగేశ్వరిలను అభినందించారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గోవిందురెడ్డి తెలిపారు. నంద్యాల ఎస్‌పీజీ స్కూల్‌లో జరిగిన అండర్–14 కబడ్డీ పోటీలో ప్రతిభ కనబరిచిన విజయ్‌కుమార్, సంజామల ఖోఖో క్యాంపులో ప్రతిభ చూపిన వైష్ణవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 19 నుంచి 21వ తదీ వరకు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వైష్ణవి, అలాగే ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజయకుమార్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు, శిక్షణ ఇచ్చిన పీఈటీ రంగస్వామిని అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హొళగుంద: మండల పరిధిలోని ఇంగళదహాళ్ గ్రామంలో శుక్రవారం దేవరగట్టు ఆలయ మాజీ చైర్మన్ కేసీ తిమ్మారెడ్డి జయంతి ఆయన వారసులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కర్నూలు ఓమిని హాస్పిటల్ వైద్యులు హాజరై దాదాపు 300 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, బీసీ హాస్టల్ వార్డెన్ శివుడు, నిర్వాహకులు రాజేశ్వర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

చిప్పగిరి: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమవుతుందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని నగరడోణ గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో రూ.39 లక్షలతో నిర్మించిన సచివాలయంను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే గుర్తించి పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయానికి మంజూరయ్యే రూ.40 లక్షల నిధులను గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు వినియోగించుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, నవరత్నాల ద్వారా ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఏకమై వచ్చినా 2024లో మళ్లీ వైఎస్ జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు.

ఆలూరు: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి, అందిస్తున్న పథకాలపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో శుక్రవారం.. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎం.ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన జరగబోయే సమావేశానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసంపై విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.